


# సౌండ్ స్లీప్!

**ఉ**దయ సంధ్యని ఉత్తమ నటిగా తీర్చిదిద్దినవాడు సాయ్‌కాలనాథ్! ఉత్తమ దర్శకుడైన అతనికి తన మనసునేనాడో అర్పించేసిందామె! నాథ్ దగ్గరున్న ఆ మనసు, ఐస్కాంతంలాగా ఆమె శరీరాన్ని కూడా అటు లాగసాగింది.

కాని చిక్కెక్కడంటే నాథ్‌కి ఏకపత్నీవ్రతుడుగా ఫీల్డ్‌లో గొప్ప పేరు. ఏ హీరోయిన్ని కదిలించినా, బాబోయ్ అంటూ గుడ్లు పెద్దవి చేసి, గుండెల మీద చేతులేసి, 'గౌతమ బుద్ధుడు' అంటూ కాంప్లిమెంటిచ్చేస్తుంది. ఆ కాంప్లిమెంట్లు విన్న కొద్దీ సంధ్యకి 'కాంపిటేటివ్ స్పిరిట్' పెరిగిపోసాగింది.

మత్తు చూపుల్తో, కొంటె మాటలతో, ఒళ్ళు విరుపుల్తో, కళ్ళు కలుపుల్తో, దాన్తో దీన్తో ఎన్తో ఎన్తో రెచ్చగొట్టేది. నాథ్ ప్రతిదానికి క్యాజువల్‌గా నవ్వి ఊరుకునేవాడు. దాంతో ఆమె మరీ రెచ్చిపోయేది. ఎవరూ చూడకుండా చూసి గిచ్చిపోయేది. అంతకన్నా ఏం చేస్తుంది? "వనిత తనంత తావలచి వచ్చిన చుల్కన కాదె?" అయినా మాంచి ఏకాంతం కోసం ఎదురు చూస్తూనే వుంది.

ఈసారి డ్రీమ్ సాంగ్ డార్జిలింగ్‌లో చెయ్యాలని ప్రొడ్యూసర్ మహా ఉత్సాహంగా వున్నాడు. ఔట్‌డోర్లు గిట్టని నాథ్‌కి తప్పలేదు. మొత్తం ఐదు రోజులు క్యాంప్!

మూడు రోజులయ్యేటప్పటికి మూడ్ మారిపోయింది నాథ్‌కి! కళ్ళు బాగా ఎర్రబడ్డాయి రాత్రిళ్ళు నిద్రపోవడం లేదని స్పష్టంగా తెలుస్తోంది.

నాల్గోరోజున లంచ్ బ్రేక్‌లో మంచ్ చేస్తూ మంచిగా కుర్చీ అంచున చేరి అడిగింది సంధ్య. "ఏం గురూజీ? డల్‌గా వున్నారు?"

కాస్సేపు మాట్లాడలేదు నాథ్ మళ్ళీ కదిపింది.

అదోలా చూస్తూ అన్నాడు నాథ్, "ఏమిటోనోయ్! రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు".

సంధ్య మొహంలో మోహం మొలకెత్తింది. "ఏం?" అని ఆత్రంగా అడిగింది.

అప్పడం నములుతున్న నాథ్ నీళ్ళు నమలసాగాడు.

"అంతే లెండి! నాతో ఎందుకు చెప్తారు? నేనేం కట్టుకున్న భార్యనా?" అంది చురుగ్గా చూస్తూ.

"ఛ! ఛ! అదేం లేదోయ్" అన్నాడు ఆ కళ్ళలోకి ఇరుగ్గా చూస్తూ.

"మరైతే ఏమిటో చెప్పండి" అంది అరకూల్‌గా.

అటూ యిటూ చూసి "మా ఆవిడ పక్కన లేకపోతే నాకు నిద్రపట్టదోయ్" అనేశాడు.

సంధ్య కళ్ళు మెరిశాయి. "పోనీ! నేనొచ్చి జోలపాడనా రాత్రికి?" అంది.

ఆ మాటకి ఆమె కళ్ళల్లోకి వెతుకుతూ చూశాడు నాథ్. క్యాజువల్‌గా వుండే కళ్ళలో ఏదో ఆహ్వానం కనబడింది సంధ్యకి.

మొలకెత్తిన మొక్క మారాకు వేసింది. 'అమ్మ ఏకపత్నీవ్రతుడా! అని పులకించిపోయింది. 'ఎన్నాల్టికి దొరికావు నవనీత చోరుడా' అని వికసించిపోయింది. 'వుండు నీ పని చెప్తా' అని విచలించిపోయింది.

ఆ రోజు సంధ్య పెర్‌ఫార్‌మెన్స్ ఎక్స్‌లెంట్స్! హీరో "మధ్యందిన మార్తాండ" మొదలూ చివరా అందక మామిడి తాండ్రలాగ జారిపోయాడు.

సిటీ టెంపరేచర్ జీరో! రూమ్ నంబర్ వన్ జీరో! సంధ్య బాడీ టెంపరేచర్ వన్ వన్ జీరో. నైలెక్స్ నైటిలోని ఆ టైట్ బ్యూటీ - వైట్ లైట్‌లో నాటీగా కనిపిస్తోంది. అద్దంలో అరమోడ్పు కళ్ళు బరువుగా మూసుకుపోసాగాయి. తాళం చెవి తీసుకుని తలుపువైపు అడుగులు వేసింది. తలపు తెరవంగానే ఎదురుగా నాథ్.

ఆనందంతో అతని మీద పడబోయింది. అతను చురుగ్గా చూసి ఎదురుగా వున్న తన రూమ్ వన్ వన్ వన్‌లోకి దారి తీశాడు.

తుపానులా అతన్ని వెంబడించి, ఉప్పెనలా అతని మీద పడి, ప్రళయంలా అతని ముఖాన్ని ముద్దులతో ముంచేసింది.

"అబ్బ! వదలవే రాకేందు వదనా" అన్నారు నాథ్.



"ఇన్నాళ్టికి దొరికిన నిన్ను అంత తేలిగ్గా వదుల్తానా నా శ్రీరంగనాథా!" ఆ పెదవులు ముద్దు మాటలు వినిపిస్తున్నాయి.

"నిన్ను రమ్మంది ఇందుక్కాదే ఇందీవరాక్షి! అంటూ మెడ చుట్టూ బిగించిన ఆమె చేతుల్ని వదిలించుకునే ప్రయత్నం చెయ్యసాగాడు నాథ్.

ఆమె చేతులు మరింత లగించి, వళ్ళు బిగించి, లాలనగా "మరెందుకమ్మా ఏకపత్నీవ్రతా?" అంది.

"నాన్సెన్స్! నేనెప్పుడూ ఏకపత్నీకవ్రతుణ్ణే! కాకపోతే రోజూ మా ఆవిడ సాధింపు వింటూ పడుకోవడం అలవాటు కాబట్టి ఈ మూడు రోజులుగా ఆ సౌండు లేక నిద్ర పట్టడంలేదు. మధ్యాహ్నం నీ ధోరణి చూసి, నువ్వూ ఆ మాత్రం సాధించలేవా అని ఆశపడ్డాను" అన్నాడు ఓరగా సాగదీస్తూ.

పూజకే తప్ప పున్నమికి పనికిరాని తుమ్మి పువ్వు లాంటి నాథ్ మొహం చూసి, నిస్సహాయంగా మంచం మీద వాలిపోయింది సంధ్య

కళ్ళు మూసుకుని తనని తాను తిట్టుకుంటున్న ఉదయ సంధ్య సరసన ఉత్సాహంగా ఒరిగాడు సాయంకాలనాథ్!